# దేవుడు ఈర్ష్యపడ్డాడు

సాయంకాలం అయిదు గంటలయింది. రామ్మూర్తిగారు మొక్కలకి నీళ్ళు పోస్తున్నారు. బొడ్డుమల్లె చెట్టు మొగ్గ తొడిగింది. య్యెర్ర గులాబి కొత్త చిగురువేస్తోంది. కనకాంబరాలు విరగబూస్తున్నాయి.

ప్రతి రోజూ సాయంకాలం యిలా మొక్కలకి నీళ్లు పోస్తు రెమ్మని పరిశీలిస్తు వుండటం అలవాటు. వుద్యోగంనించి రిటైర్ అయి భార్యని పోగొట్టుకుని స్వంత వూరిలో ఒంటరిగా వుండలేక శాంతిని వెతుక్కుంటూ పెద్ద కొడుకు ఇంటికి వెళ్ళారు. అక్కడ వారం రోజులన్నా వుండలేక చిన్న కొడుకు దగ్గరకి వచ్చి రెండు నెలలైంది. కొడుకు అద్దెకున్న యిల్లు మూడే గదులు. ఒకటి వంటకి, రెండోది కొడుకూ- కోడలికీ, ముందున్న మూడో గది తనకీ ప్రత్యేకించారు. చిన్న కోడలు సుశీల మితభాషి. పది మాటలు మాట్లాడితే ఒక్క మాటలో జవాబిస్తుంది. మనస్సులో యేముందో గాని పైకి మాత్రం గౌరవంగానే చూస్తూ వుంది. యిది చాలు అన్పిస్తుంది రామ్మూర్తిగార్కి. యిలా అని యిక్కడ యెన్నాళ్ళని వుండటం? అలా అని యెక్కడికి వెళ్ళటం? వున్నది యిద్దరే కొడుకులు. పెద్దవాడు భార్యా దాసుడు. అక్కడ తను వుండలేడు.

భార్య బ్రతికి వున్న రోజుల్లో కొడుకులూ, కోడళ్ళూ అక్కడికి రావటమే కాని యిక్కడికి ఒక్కసారీ వచ్చి యెరగరు, కాలం యెవరికి ఒక్కలాగవుండదు అన్న మాటకి తన జీవితమే నిదర్శనం. మొక్కలకి నీళ్లు పోస్తూ గత జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవటం అదో సరదా! యీ పని

కాగానే కాళ్ళూ చేతులూ కడుక్కుని బట్టలు మార్చుకుని వుత్తరీయం వేసుకుని చేతి కర్ర తీసుకుని అరమైలు దూరంలో వున్న పార్కుకి షికారుగా వస్తారు. పచ్చగడ్డిలో కూర్చుని వచ్చిపోయే జనాన్ని చూస్తూ, దాగుడు మూతలాడే పిల్లలను పరీక్షిస్తు కాలక్షేపం చేయటం రామ్మూర్తిగారి దిన చర్యలో అతి ముఖ్యమైన భాగం. యిలా రాకుంటే ఆయనకు తోచదు, యీ రోజూ అలాగే వచ్చారు. ప్రతిరోజూ తను కూర్చునే ఆ చోటులో మరొకాయన కూర్చుని వున్నాడు.

ఆయనకి దాదాపు తన వయుస్సేలా వుంది, తనిలానే పంచా, వుత్తరీయం, కళ్ళ జోడూ, చేతికర్రా వగైరా యిదే వేషం. రిటైర్ అయిన బాపతులానే వుంది. అంతా బానే వుంది. కాని యింత పెద్ద పార్కులో అంత ఖాళీ జాగావుంటే చోటేలేనట్లు కూర్చున్న చోటులోనే కూర్చోవాలా?

కోపం వచ్చేసింది. అది అసూయగా మారింది. అది చికాకు కల్పించింది. కోపాన్ని అణుచుకుంటూ కాస్త దూరంగా కూర్చున్నాడు. ఆయనా యిటే చూస్తున్నాడు. కాని పల్కరించలేదు. రామ్మూర్తిగారూ పెదవి కదపలేదు.

ఇలా రెండు రోజులు జరిగి పోయాయి, మూడోనాడు ఒకర్నిచూసి ఒకరు నవ్వుకున్నారు. ఒకరి పేరు ఒక్కరు తెల్సుకున్నారు. అంతే- యింక కాలం యెలా గడిచిపోయిందో యిద్దరికీ తెలియదు. ఆయనా రిటైర్ అయినివాడే. ఆస్తిపాస్తులు యేం లేవు. వున్న ఆస్తి పిల్లలే. అందువల్ల ఆఖరి దశలో వీళ్ళ దగ్గరకి వచ్చి వుండక తప్పలేదు. అయితే యిద్ద రబ్బాయిలే కాదు, ఆడపిల్లలు కూడా వున్నారు వాళ్ళూ రమ్మంటారు. "కాని వెళ్ళం" అంటూ కృష్ణమూర్తి తన వివరాలు చెప్పారు. రామ్మూర్తి గారికి భార్య లేదు, కృష్ణ మూర్తిగారికి వుంది. యిదే తేడా. కృష్ణమూర్తి గారు అస్తమానం యేవో ఒకటి కబుర్లు చెప్తూనే వుంటారు. తన తల్లి దండ్రులని గురించీ, భార్యని గురించీ, కొడుకులూ కోడళ్ళని గురించీ చెప్పేస్తు ఆ తర్వాత ప్రస్తుత సమాజ పరిస్తుతులనీ మారిన కాలాన్నీ అంతకి మించి మారిపోతున్న మనుషులని గురించీ నిశితంగా విమర్శిస్తూం

టారు. తరాల అంతరాలని గురించి దీర్ఘమైన వుపన్యాసం యిస్తూ ఆఖరున తన అభిప్రాయాన్ని యిలా తేల్చేస్తారు.

రామూర్తిగారూ! యీ కాలం యువతరానికి విలువలు తెలియవు. తల్లిదండ్రులని యెలా చూడాలో తెలియదు, యెంతసేపూ వాళ్ళ సుఖం వాళ్ళ ఆనందం .. అంతే" అలా రామ్మూర్తిగార్కి మౌనంగా వింటూ వుండటమే యిష్టం. యిలాగేరోజులు జరిగిపోతున్నాయి. ప్రతిరోజూ కలుసుకోవటం అరమరికలు లేకుండా మాట్లాడటం వల్ల యిద్దరూ మరీ సన్నిహితులు అయిపోయారు. ఒకరంటే ఒకరికి ఆత్మీయత యెక్కువ అయిపోయింది. రామ్మూర్తిగారి మనస్సుకి కాస్త శాంతి దొరికింది మిత్రుడి దగ్గర. 'అమ్మయ్య! యిలా రోజులు గడిచినాచాలు' అనితృప్తిపడుతున్నాడు.

రోజులా రామ్మూర్తిగారి మొక్కలకి నీళ్ళు పోసి, రెండు మల్లె మొగ్గలు కోసి జేబులో వేసుకుని పార్కుకి వచ్చికూర్చున్నారు. కృష్ణమూర్తిగారు యింకా రాలేదు. 'యెందువల్లనబ్బా' అనుకుంటూ 7 గంటల వరకూ యెదురు చూశారు. ఏడు దాటింది. ఎనిమిది కావస్తోంది. అయినా కృష్ణమూర్తిగారి జాడలేదు. ఏమై వుంటుంది? కోడలు సెనగపిండి పట్టించుకుని రమ్మని బజారుకి పంపి వుంటుంది. అయినా ఇంత ఆలశ్యమా? కొడుకు 'బజారీ సరుకులు పట్టించుకు రానాన్నా' అన్నాడేమో! లేక భార్య 'తెల్లవారితే శనివారం. కర్పూరం, కొబ్బరికాయీ పట్టుకురండి' అన్నదేమో! అసలువాళ్ళు అలాఎన్ని పన్లు చెప్పినా ఈయన అవన్నీ క్షణంలో చేసి చిన్నపిల్లాడిలా పరుగున వచ్చేస్తాడే! ఇవాళ యింతసేపైనా యెందుకు రానట్లు? రోడ్డు దాటుతూండగా ఏం కాలేదు గదా? ఆరోగ్యం ఏమన్నా కాలేదు గదా? ఛీ నావన్నీ వెధవ ఆలోచనలు. కృష్ణమూర్తికి యేమీ కాకూడదు అనుకొన్నారు.

ఆయన భార్యని ఇప్పటివరకూ ఒక్కసారీ చూడకున్నా ఆవిడ యింట్లోచేసే ఫలహారాలు అప్పుడప్పుడూ పొట్లాం కట్టి తీసుకువచ్చి పెడుతూ వుంటాడు కృష్ణమూర్తి. ఫలహారాలు చాలా రుచిగా వుంటాయి. అవి తినా

లని ఒకవైపు మనసు పెరపెరలాడుతూంటుంది. మరోవయిపు అభిమానం అడ్డు వస్తూ వుంటుంది.

"కృష్ణమూర్తి! యిలా తీసుకురాకయ్యా, మీ కోడలు ఏమన్నా అనుకోగలదు" అన్నాడు. అందు కాయన నవ్వేస్తూ-

"మా కోడలు చాలా మంచిపిల్ల. మమ్మల్ని చాలా గౌరవంగా చూస్తుంది. మీ కోసం తనే ఇవన్నీ కట్టి యిచ్చింది. తీసుకోండి" అని బలవంత పెడతాడతను.

"అదృష్టవంతుడివి కృష్ణమూర్తీ! అలాంటి మంచి కోడలు రావటం నిజంగా అత్త-మామల అదృష్టమే. అందులోనూ నీకు అనుకూలవతి అయిన భార్య కూడా ఉంది. మీరింకా కొంతకాలం చల్లగా సంతోషంగా బ్రతకాలని నా కోరిక. భగవంతుడిని అదే కోరుకుంటాను.

రామ్మూర్తిగారి మాటలకి కృష్ణమూర్తి పేలవంగా నవ్వేశారు. రామూర్తి మిత్రుడి ముఖంలోకి తదేకంగా చూస్తు ఉండిపోయారు. కృష్ణమూర్తి సంభాషణని తెలివిగా తప్పించేశారు. మిత్రుడి కోసం యెదురు చూస్తు ఒంటరిగా కూర్చున్న రామూర్తిగారికి జరిగిపోయిన విశయాలన్నీ గుర్తుకి వస్తున్నాయి.

అబ్బా! ఒక్కరోజు కృష్ణమూర్తిని చూడకుండా వుండలేకపోతే యెలా? యీ స్నేహితం ఎంతో మధురంగా వుంది. నిజమే! కాని యిలాగే సాగుతుంది అని గ్యారంటీ ఏమిటి? ముప్ఫయి సంవత్సరాలు ఒక్క ప్రాణంగా మెలిగిన భార్య రెండు రోజుల జ్వరంలో కన్నుమూసి ఒంటరి వాడ్ని చేసి వెళ్ళిపోయింది. పిల్లలున్నా వాళ్ళ జీవితాలు వాళ్ళవి, వాళ్ళ సుఖం వాళ్ళది. నా ఒంటరితనాన్ని వాళ్ళు పోగొట్టలేరు.

కృష్ణమూర్తి ఎందుకో యివాళ రాలేదు-ఇక రాకపోవచ్చు. ఇతని కోసం యింకా నేనెందుకు యెదురు చూడాలనే వుంది. కానీ యింటి దగ్గర కోడలు యెదురుచూస్తు ఉంటుంది. ఆలస్యం అయితే చిరచిరలాడుతుంది. అబ్బాయి ఏమీ ఎరుగనట్లు పోజ్‌కొట్టి కూర్చుంటాడు. ఎందుకు వాళ్ళకి

కష్టం కలిగించటం అనుకుని మెల్లగా లేచారు. వెనక్కి తిరిగి చూస్తునే పార్క్ గేట్‌లోకి వచ్చేశారు.

"అరెరె...రామూర్తిగారూ! అప్పుడే వెళ్ళిపోతున్నారా! నే అనుకున్నంతా అవుతోంది" అంటూ సడిగాలిలా వచ్చేసి చెయ్యిపట్టుకున్నారు కృష్ణమూర్తి.

మిత్రుడిని చూడగానే ముఖం వికసించింది.

"ఇవాళ ఎందుకింత ఆలస్యం అయింది?" ఆత్మీయంగా అడిగారు

"రండి చెప్తాను." రామ్మూర్తిగారి చెయ్యి పట్టుకుని లాకెళ్ళి యధాస్థానంలో కూలేసి "యింక చెప్తాను-సావధానంగా వినండి" అంటూ మొదలు పెట్టారు.

"యివాళ వుదయంనించీ మా కోడలు ఎందుకో సన్నాయి వాయిస్తోంది. మంగళ వాయిద్యపు మోత భరించలేక అబ్బాయి ఆఫీసుకి పరుగెత్తాడు. అయినా సన్నాయి ఆగలేదు. మరి నేను, మా ఆవిడ ఎక్కడికి పరుగెత్తగలం? కనుక సంగీతం ఆలకిస్తూనే కాలం వెళ్ళదీశాం. సాయంకాలం కాగానే అలవాటుగా చెప్పులు వేసుకుంటున్నాను. శ్రీమతి చిర్‌బుర్‌మంటూ వచ్చింది.

"అసలే మీకు జలుబు పట్టింది. కదా! ఆ వెధవ పార్కుకి వెళ్ళకుంటే ఏం కొంపలు అంటుకుంటాయ్?" అంది కరుగ్గా.

"వూఁ తర్వాత?"

"శ్రీమతి ఏం చేయవద్దన్నా తక్షణం మానేస్తాను కానీ, ఈ పార్కుకి వెళ్ళద్దంటే మాత్రం చస్తేమానను అన్నది ఆవిడకి తెల్సు. అయినా కోపం తెచ్చుకోలేదు నేను. 'కాలక్షేపంకాదే' అన్నాను. 'బాటానీలూ, పల్లీలూ యిస్తాను తింటూ కూర్చోండి' అని తెచ్చి యిచ్చింది. అవన్నీ వుత్తరీయం కొంగున మూట కట్టేసుకున్నాను. ఆవిడని లోపలికి వెళ్ళ

నిచ్చాను. అంతే! గదిలోంచి బయటకొచ్చి, చెప్పులు చప్పుడవకుండా చేత్తో పట్టుకుని రోడ్డుమీదకొచ్చాను." కృష్ణమూర్తి వుత్తరీయం కొంగు ముడివిప్పి, రామ్మూర్తిగారి చేతిలో కొన్ని పోసి, కొన్ని తను తింటూ కబుర్లు చెపుతున్నారు.

"ఈవాళ ఆలస్యం అయింది. మీకు తోచివుండదు కదూ?"

"ఔను."

"నాకూ అంతే! కానీ యీ వూళ్లో యిలా యెన్నాళ్ళు వుండతేం అనుకుంటాను."

"వెళ్ళిపోతారా? నాకు చెప్పకుండా వెళ్ళకండి. కనీసం నా కోసమైనా యిక్కడే వుండేందుకు ప్రయత్నించండి. యింతకీ మీరు వెళ్ళి పోవల్సిన కారణం ఏమిటి?"

ఏం వుంటుంది? ప్రతి యింట్లోనూ వుండేదే. అది సరే గానీ ..." అంటూనేహాచ్చి....హాచ్చి అని నాలుగుసార్లు తుమ్మేశారు కృష్ణమూర్తి గారు.

"మీ శ్రీమతికే కాదు కొడుక్కీ కోడలికీ కూడా మీరంటే అభిమాన మేలా వుందే!" బటానీలు తింటూ అడిగారు రామ్మూర్తిగారు కృష్ణమూర్తి గారు నవ్వి, కళ్ళజోడులోనించి మిత్రుడిని పరిశీలిస్తూ.

"మీ వాళ్ళకో?" యెదురు ప్రశ్న వేశారు.

"ఆ నా సంగతే చెప్పండి? వుద్యోగం రోజుల్లో యెలా బతికినా రిటైర్ అయిన తర్వాత బతకటం అనవసరం అంటాను. పెన్షన్ వచ్చే వుద్యోగమైనా వుండాలి. భార్య అయినా బతికి వుండాలి. యీ రెండూ లేకుంటే ఆ మగాడికి అర్థాకలి కూడే." ఆవేదన నిండిన స్వరంతో అన్నారు రామ్మూర్తిగారు.

"నిజం. యింకాసిని పల్లీలు పట్టండి. అన్నట్టు పల్లీలతో పాటు కాస్త బెల్లం ముక్క కూడా యిచ్చింది మీ చెల్లెమ్మ." చేతిలో పెట్టేశారు.

"చెల్లెమ్మ పంపే చిరుతిండి తినటమే కానీ, ఒక్కసారన్నా చూడ లేదు. అసలు మీ యింటికి రమ్మని చెప్పలేదు."

"ఇప్పుడు రండి."

"ఇంకా నయం. చీకటి పడింది."

"ఫర్లేదు అన్నాగా."

"మీరలా మరోసారి పిలిచారా ఇప్పుడే వచ్చి తీరుతాను."

"ఒద్దు, ఒద్దు మా అబ్బాయి పేరూ, ఇల్లు నంబరూ చెప్పానుగా-తర్వాత వద్దురుగాని."

"చెప్పారు. కనుకనే మీకు ముందు చెప్పకుండానే చక్కా వచ్చేసి తలుపు తడతాను."

"అమ్మో!....ఆ పని చెయ్యకండి." కృష్ణమూర్తిగారు కళ్ళలో బెదురు కన్పించింది.

రామ్మూర్తిగారు ఆశ్చర్య పోయారు. ఇద్దరూ కబుర్లు చెప్పు కుంటూనే లేచి పార్కు బైటకు వచ్చారు.

"మరి వస్తాను." శలవు తీసుకుని కృష్ణమూర్తి రోడ్డుదాటి చకచకా నడుస్తున్నారు. వుత్తరీయం కొంగు తలమీద కప్పుకున్నారు. రామ్మూర్తి యింటి వైపుగా వెళ్ళబోయి మిత్రుడిని తమాషా చేయాలన్పించింది. అంతే! మెల్లగా రామ్మూర్తిని అనుసరించాడు.

యిల్లువచ్చేసింది 'అబ్బా-చాలా దూరమే. కాళ్ళు పీకుతున్నాయి. రాకుండా వుండాల్సింది. ఏమిటో చిన్నపిల్లాడిలా చేస్తూన్నాను' అని విసుక్కుంటూనే నిలబడిపోయారు కృష్ణమూర్తి వరండా మెట్లు ఎక్క బోతూ ఆగిపోయారు. లోపలి నుంచి బిగ్గరగా మాటలు విన్పిస్తూన్నాయి. కోడలి గొంతు కాజోలు కర్కశంగా విన్పిస్తూ వుంది.

"అత్తగారూ! చూడండీ, యిది మీ యిల్లు కాదు, నా యిల్లు. కష్టు పడి తెచ్చేది నా మొగుడు. యీ యింట్లో నా యిష్టం జల్గాలి. మీకూ, మీ

ఆయనకీ పెట్టలేక చస్తున్నాం. మీ దిద్దరే కాక ఆ ముసలాయనకో స్నేహితుడా? ఆయన కోసం సలహిరాలు పొట్లాలు కట్టి పట్టుకుపోవటమా? మీ పోరట్లతో నా యిల్లు గుల్లచేస్తుంటే? చూస్తు వూరుకోవాలా? వీల్లేదు, రేపటి నించీ యిలా జరక్కూడదు."

"హైమా! ఆగు. కాస్త నామాట విను. మా ఆయనకీ, నాకూ నువ్వు పెట్టిన పలహారమే మేం మా యిష్టం వచ్చినట్లు చేసుకున్నాం. కానీ నేనేం ముట్టుకోలేదు. నువ్వు యింకా మాట్లాడావంటే వూరుకోను. యిది నీ యిల్లే. 'కాదు' అనను. కానీ నా కొడుకు యిల్లు కూడా అని గుర్తు వుంచుకో."

"హక్కు నాదే, నీది కాదు." హైమ యింకా యేదేదో అనేస్తోంది. కృష్ణమూర్తిగారు లోపలికి పోబోయినవారల్లా చప్పున వెనక్కి తిరిగారు. రామ్మూర్తి వూహించని పరిస్తితి జరగటం వల్ల మొదట కాస్త తత్తర పడి, తర్వాత త్వరత్వరగా వెనక్కి వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తుండగా కృష్ణమూర్తి చూడనే చూశారు. ఆయన ముఖాన కత్తివాటుకి నెత్తురుచుక్క లేనట్లుగా అయిపోయింది.

రామ్మూర్తి త్వరత్వరగా యింటికి వచ్చేశారు. అప్పుడే కొడుకు విసుక్కుంటున్నాడు. "పార్కులో యింతసేపు కూర్చోవటం యెందుకు? మీరు భోజనం చేసి లేస్తేనే కానీ నేనూ, సుశీలా చేసేందుకు అవదు."

"బాబూ! ఆకలి లేదురా. నాకేం వద్దు." అశాంతిగానే బట్టలు మార్చుకుని మంచం మీద వాలిపోయారు. యెంత పొరపాటు పనిచేశాను. అనవసరంగా కృష్ణమూర్తి మనస్సుకి బాధ కల్గించాను. రాత్రి అంతా అశాంతి పడిపోయారు.

* * *

రామ్మూర్తి నాలుగు రోజులుగా స్నేహితుడి కోసం యెదురు చూశారు. కృష్ణమూర్తి రాలేదు. ఎందువల్ల? ఆ రోజు అంతా విన్నానని

అభిమానపడ్డాడా? అభిమాన పడేందుకేం వుంది? యింటింటా వుండేవేగా! ఆరోగ్యం బాగాలేదా? వూరు వెళ్ళాడా? మరేమన్నా జరిగివుంటుందా? రామ్మూర్తిగారి మనస్సు మనస్సులో లేదు. కాలు కాలిన పిల్లిలా యిటూ అటూ పచార్లు చేస్తు స్నేహితుడు వచ్చే దారి వైపుగా చూసి చూసి అల్సి పోయారు. 'వాళ్ళ యింటికి వెళ్ళి వస్తేనో' అనుకుని సగం దూరం వెళ్ళి వెనక్కి వచ్చేశారు. నాలుగో రోజునా యెదురు చూశారు. కృష్ణమూర్తిగారి జాడ లేదు. అతన్ని చూస్తే కాని యీ అశాంతి తగ్గదు. వాళ్ళ యింటికి వెడతాను. బయలు దేరారు. యింటి తలుపులు బార్లా తెరిచి వున్నాయి. యిల్లు కళ తప్పినట్లుంది. స్నేహితుడి చెప్పులు కనిపిస్తాయేమో అని కళ్ళతోనే వెతికారు. అవి లేవు. చేతి కర్ర లేదు. నా కోసం మరో దారిన పార్కుకి వెళ్ళి వుండడు కదా? క్షణం ఆలోచిస్తు అలాగే నిల్చుండి పోయారు. లోపలినుంచి సన్నగా రోదన ధ్వని విన్పిస్తోంది. ఎవరో యేడిచేది? రామ్మూర్తిగారి కాళ్ళు వణికాయి. లోపలినుంచి వయస్సు మళ్ళిన యిద్దరు వ్యక్తులు యివతలకి వచ్చారు. రామ్మూర్తిని చూస్తునే "ఎవరు కావాలి?" అని అడిగారు.

"కృష్ణమూర్తి."

రామ్మూర్తిని కిందనించి పైకి ఒకసారి పరీక్షించి అన్నారు.

"లేడు"

"ఎక్కడికి వెళ్ళాడు?"

"చచ్చిపోయాడు. ఈవాళకి నాలుగు." వాళ్ళు వెళ్ళిపోయారు. లోపలినుంచి ఈంకా ఏడుపు విని పిస్తునే వుంది. రామ్మూర్తి శిలా ప్రతిమలా నిల్చిపోయారు. అయిదు నిమిషాల తర్వాతగానీ అసలు జరిగినదేమిటో అర్థం కాలేదు. అర్థం అయిన తర్వాత నిలువెల్లా కంపించి

పోయారు. ఏమిటీ! కృష్ణమూర్తి చచ్చిపోయాడా? ఇది నిజమా? ఒక్కగానొక్క స్నేహితుడు నన్ను వదిలి వెళ్ళిపోయాడా? వద్దంటేవినకుండా నీ ఇంటికి వచ్చానని కోపం వచ్చిందా?

రామ్మూర్తిగారి కన్నీళ్ల కాలువలు కడుతున్నాయి. లోపలినించి మాటలువినిపించాయి. "మా మామ గారండీ- ఎంతో మంచివారండి. ఆయన దేవుడులాంటి వారండి!" ఇది కోడలుగొంతు.

"ఔను ఔను" అంటున్నారు వింటూన్నవాళ్లు.

సన్నగా విన్పించే ఏడుపు ఆగి పోయింది.

"ఓసేవ్ పద్మా! ఆయన్ని నీ ఈటెల్లాంటి మాటలతో బాధ పెట్టావు కదే! ఆ బాధ గుండె నొప్పిగా మారి అరగంటలో హరీ అన్నారు కదే! ఇప్పుడు ఆయన దేవుడు అంటున్నావా? నువ్వసలు మనిషివటే? నీకు మనసుందటే? రాక్షసీ!" అత్తగారు బావురుమంది. పద్మ ఏదో గొణుగుతోంది.

రామ్మూర్తిగారు గిర్రున వెనక్కి తిరిగారు.

ఈ ప్రపంచంలో అందరికీ మనిషి చచ్చినతర్వాత గానీ మంచితనం తెలియదు ఇప్పుడు యిక్కడ ఎందరు ఎలా అనుకున్నా అతను వినడు, బాధపడడు, గుండెనొప్పి రాదు. 'కృష్ణమూర్తీ! నీవు వెళ్ళేప్పుడు నీ అర్ధాంగి వంటరితనం గురించి ఆలోచించావా? ఆమెని ఎవరు ఓదారుస్తారు? ఒక్కసారైనా చూడని నేను ఇప్పుడు వెళ్ళి ఏమని ఓదార్చను? కృష్ణమూర్తీ! ఈ నా వార్ధక్యంలో నీ స్నేహం మనశ్శాంతినిస్తోందని పొంగిపోయాను. నా సంతోషాన్ని చూసి 'దేవుడు ఈర్ష్య పడ్డాడు.' అందుకే నిన్ను తన దగ్గరకి తీసుకువెళ్లాడు. భగవంతుడు పిలిచినానన్నూ,

నీ తోడూ నీడా అయిన ఆ అమాయకురాలిని వదిలి ఎలా వెళ్ళగలిగావు కృష్ణమూర్తీ?'

రామ్మూర్తిగారి నిడుగులు తడబడ్డాయి. ఎలా ఇల్లు చేరారో ఆయనకే తెలియదు. రామ్మూర్తిగారు మరెప్పుడూ పార్కుకి రాలేదు. పచ్చ గడ్డిలో కూర్చోలేదు. ఆటలాడే పిల్లలని ఆసక్తిగా చూడలేదు. అయితే ఇద్దరు తాతగార్లూ కూర్చునే చోటు ఖాళీగా గుర్తించిన పిల్లలు మాత్రం వాళ్ళిద్దరూ మళ్లీ వస్తారనే ప్రతిరోజూ ఎదురు చూస్తున్నారు. *

విజయ మాస పత్రిక

8/7/93